క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న నేతలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని గన్య తండాకు చెందిన విఠల్‌కు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు పాండరి రూ.1.45లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. విఠల్ కూతురు నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాధితుడి విజ్ఞప్తి మేరకు వారు ఆదివారం ఎల్‌ఓసీని అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆంద్రయ్య, దేవిచంద్ తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య త్యాగశీలి

సీపీఎం నేత నాగరాజు

నర్సాపూర్: పుచ్చలపల్లి సుందరయ్య తన ఆస్తినంతా పేదలకు పంచిపెట్టిన గొప్ప త్యాగధనుడని సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగరాజు అన్నారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకుని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశంలో కమ్యునిస్టు ఉద్యమానికి నాయకత్వం వహించారని కొనియాడారు. కార్యక్రమంలో నాగభూషణం, పోచయ్య, సామ్యానాయక్, రమేశ్‌రెడ్డి, మహేశ్, శంకర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగు విత్తనాలు



పీఏసీఎస్‌లో ఉన్న విత్తనాల బస్తాలు

శివ్వంపేట(నర్సాపూర్): రైతులకు అందుబాటులో జీలుగు విత్తనాలు ఉన్నాయని ఏఓ లావణ్య, పీఏసీఎస్ సీఈఓ మధు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ విత్తనాలు కావాల్సిన రైతులు శివ్వంపేట ప్రాథమిక సహకార సంఘం నుంచి తీసుకెళ్లాల్సిందిగా సూచించారు. రెండున్నర ఎకరాలకు 30కిలోల బస్తాను సబ్సిడీపై రూ.1,116 ఇవ్వనున్నట్లు తెలిపారు.


కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



కృష్ణావతారంలో వేణుగోపాల స్వామి

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన దొంతి వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి, సమేత వేణుగోపాలస్వామికి కృష్ణావతారంలో పల్లకి సేవ నిర్వహించారు. సోమవారం వామనావతారంలో పల్లకి సేవ నిర్వహించనున్నట్లు పూజారి వేణు గోపాలశర్మ తెలిపారు.

నేటి నుంచి కూర్మ నరసింహస్వామి ఉత్సవాలు



కూర్మనరసింహస్వామి ఆలయం

తూప్రాన్: పట్టణంలోని రామాలయం సమీపంలో ఉన్న కూర్మ నరసింహస్వామి ఆలయ 41వ వార్షికోత్సవాలు సోమవారం నుంచి 22వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, ఆరాధన అలాగే మంగళవారం మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ, ఆజనేయ స్వామికి పంచామృతాభిషేకం, బుధవారం సుదర్శన హోమం, పూర్ణాహుతి, కల్యాణ మహోత్సవం అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

లక్షలు వెచ్చించారు.. విస్మరించారు

ప్రజావసరాల కోసం లక్షల నిధులు కేటాయించి గ్రామాలలో పంచాయతీ భవనాలు నిర్మించారు. కానీ వాటిని ప్రారంభించడంలో అధికారులు, పాలకులు అలసత్వం వహిస్తున్నారు. అలాగే పలు గ్రామాలలో సామాన్యులు పెళ్లిళ్లు, విందు, వినోదాలు నిర్వహించుకునేందుకు నిర్మించిన మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణాలు కూడా అదే దుస్థితిలో ఉన్నాయి. నిరుపయోగంగా పడిఉన్న ప్రజల ఆస్తులు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయో ఎదురు చూడాలి మరి.

- జీడిపల్లిలో వృథాగా మినీ ఫంక్షన్ హాల్
- కొన్నిచోట్ల నిరుపయోగంగా పంచాయతీ భవనాలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- వినియోగంలోకి తేవాలని కోరుతున్న స్థానికులు



జీడిపల్లిలో నిరుపయోగంగా ఉన్న మినీ పంక్షన్ హాల్

మనోహరాబాద్(తూప్రాన్): మండల పరిధిలో పంచాయతీ భవనాలు, మినీ ఫంక్షన్ హాళ్ల నిర్మాణాలు చేపట్టారు. కానీ వాటిని ప్రారంభించడం అధికారులు మర్చిపోయారు. ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని, అధికారులు అలసత్వం వహిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాళ్లకల్ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరడంతో దానిని కూల్చివేశారు. అదే సమయంలో కరోనా వ్యాపించడంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు గదులలో పంచాయతీని కొనసాగిస్తున్నారు. గడా ప్రత్యేక అధికారి చొరవతో పనులు ప్రారంభించి పంచాయతీ భవన నిర్మాణం పూర్తిచేశారు. కానీ ఇప్పటికీ అది ప్రారంభానికి నోచుకోలేదు. విద్యార్థులకు సమస్యగా మారింది. మూడు సంవత్సరాలు గడిచినా పంచాయతీని తరలించకపోవడం శోచనీయం. డబ్బులు కట్టలేదని సదరు కాంట్రాక్టర్ పంచాయతీ భవనానికి బిగించిన కిటికీలను తొలగించి తీసుకపోవడం మరో విచిత్రం. అలాగే ముప్పిరెడ్డిపల్లిలో నిర్మాణం పూర్తయినా వినియోగించడం లేదు. మరోపక్క మినీ ఫంక్షన్ హాళ్లది కూడా ఇదేపరిస్థితి. ఒక్కో హాల్ నిర్మాణం కోసం గడా ప్రత్యేక నిధుల నుంచి రూ.20లక్షల మంజూరైనా పనులు పూర్తి చేయడంలేదు. జీడిపల్లిలో పనులు పూర్తికాకపోవడంతో మినీ పంక్షన్‌హాల్ ప్రారంభించలేదు. ముప్పిరెడ్డిపల్లిలో నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. భవనాలను ప్రారంభించేలా అధికారులు కృషి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కాళ్లకల్‌లో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం

సొంత భవనానికి తరలించాలి



మూడేళ్లుగా పంచాయతీని పాఠశాలలో నిర్వహిస్తుండడంతో విద్యార్థులకు సమస్యగా మారింది. అధికారులు దృష్టి సారించి పంచాయతీ భవనాన్ని ప్రారంభించాలి. –గానుగు రాజు, కాళ్లకల్

ఫంక్షన్ హాల్స్‌ను ప్రారంభించాలి



మినీ ఫంక్షన్ హాల్స్ నిర్మాణాలు పూర్తయినా వాటిని ప్రారంభించడం లేదు. అధికారులు స్పందించి అందుబాటులోకి తేవాలి. –సుధాకర్, కాళ్లకల్

త్వరలోనే ప్రారంభిస్తాం



పై అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి త్వరలోనే పనులు పూర్తిచేస్తాం. భవనాలకు మరమ్మత్తులు చేయించి ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చూస్తాం. –సతీశ్, ఎంపీఓ, మనోహరాబాద్



సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

పాపన్నపేట(మెదక్): చిన్ననాటి అనుబంధాలు ఎక్కువకాలం కొనసాగుతాయని రిటైర్డ్ హెడ్ మాస్టర్ ఆకుల బాలయ్య అన్నారు. ఆదివారం పాపన్నపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో 2004–05 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. సుమారు 80మంది విద్యార్థులు అంతా కలిసి ఉత్సాహంగా గడిపారు. తమ అనుభవాలను పంచుకున్నారు. అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. వారి బ్యాచ్‌లో చనిపోయిన శ్రీకాంత్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు రిటైర్డ్ ఎంఈఓ మోహన్ రాజు, జ్ఞానోబ, మాధవరెడ్డి, పద్మశ్రీ, రాజశేఖర్, చంద్రహాస్, పూర్వ విద్యార్థులు సురేందర్ సింగ్, విక్రం రాజు, శ్రీరాం దుర్గేశ్, వెంకట్, తులసి, సుప్రియ, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

గోదాం వద్ద రైతుల నిరసన

నర్సాపూర్: వడ్లు ఖాళీ చేసేందుకు వచ్చినా తమను పట్టించుకోవడం లేదని అజ్జమర్రికి చెందిన రైతులు వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అజ్జమర్రికి చెందిన రైతులు నీరుడి రమేశ్, యాదగిరి, శ్యామయ్య, చంద్రయ్య, రమేశ్, అశోక్‌తోపాటు 15మంది రైతులు ఆదివారం మాట్లాడారు. చిలిపిచెడ్ మండలంలోని అజ్జమర్రి గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి నెల రోజుల క్రితం తమ వడ్లు తీసుకువెళ్లామని, ఐదు రోజుల క్రితం తూకం వేసి ఒక డీసీఎం, ఒక లారీలో వడ్లు పంపారన్నారు. మూడు రోజుల క్రితం ఒక డీసీఎం, ఒక లారీలలో వడ్లను మరోసారి నర్సాపూర్ మండలంలోని బ్రాహ్మణపల్లి రైసుమిల్లుకు పంపారని చెప్పారు. వడ్లను మార్కెట్ కమిటీ వద్దకు తెచ్చి రోజుల తరబడి నిరీక్షిస్తున్నామని వాపోయారు. తామే వడ్లను ఖాళీ చేసేందుకు గోదాం వద్దకు వెళ్లినా ప్రయోజనం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, రైసుమిల్లు యజమానులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల మధ్య సమన్వయం లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

బీటీ రోడ్డు ధ్వంసం

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తి నుంచి యశ్వంతరావ్‌పేట వెళ్లే ప్రధాన దారి మొత్తం ధ్వంసమైంది. రోడ్డు మార్గం మొత్తం కంకరతేలి గుంతలమయం కావడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలినడకన వెళ్లడానికి సైతం ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. అదేవిధంగా మూలమలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరచు ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరారు.



ధ్వంసమైన బీటీ రోడ్డు

ఇబ్బందులు రానివ్వం

తహసీల్దార్ కృష్ణ

టేక్మాల్(మెదక్): ధాన్యం కొనుగోలు, తరలింపులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తామని తహసీల్దార్ కృష్ణ చెప్పారు. మండలంలోని తంప్లూర్, టేక్మాల్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన సందర్శించారు. కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు దిగులు చెందాల్సిన పనిలేదని తడిచిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని, అలాగే కొనుగోలు అయిన వెంటనే లారీలలో తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మిల్లర్లతో మాట్లాడి లారీలను వెంటవెంటనే ఖాళీ అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట జూనియర్ అసిస్టెంట్ ఉదయ్, ప్యారాలీగల్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణ

మంత్రి దామోదర ఆర్థిక సాయం

టేక్మాల్(మెదక్): మండలంలోని కుసంగి గ్రామానికి చెందిన బాయికాడి ప్రభుకుమార్ కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సంగమేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆదివారం సంగారెడ్డిలో కలిశారు. విషయం తెలుసుకున్న మంత్రి వెంటనే మృతుడి భార్య సుప్రియకు ఉద్యోగం ఇస్తానని హామీ ఇచ్చి, కూతురు పేర ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని రూ.50వేలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంజయ్య, నారాయణ గౌడ్, సుబ్బారావు, పాండు తదితరులు ఉన్నారు.

• గ్రామదేవతలారా.. కరుణించండి..



బోనాలను ఊరేగిస్తున్న మహిళలు

మండల పరిధిలోని మక్తభూపతిపూర్ గ్రామంలో గ్రామదేవతలకు మహిళలు ఘనంగా పూజలు నిర్వహించారు. బండ్లు, బోనాలతో ఊరేగించారు. ఆదివారం ప్రారంభమైన ఈ కార్యక్రమం మంగళవారం వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. మహిళలు బోనాలను అందంగా అలంకరించి నెత్తిన పెట్టుకొని చప్పుచప్పుళ్ల మధ్య గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. – హవేళిఘణాపూర్(మెదక్)

భారీ వర్షం.. అన్నదాతలకు నష్టం

శివ్వంపేట(నర్సాపూర్): జిల్లావ్యాప్తంగా కురిసిన భారీ వర్షం వల్ల మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు నష్టం వాటిల్లింది. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. మండల కేంద్రమైన శివ్వంపేటతోపాటు చెన్నాపూర్, చిన్నగొట్టిముక్ల, దొంతి, పలు గ్రామాల్లో ఆదివారం వర్షం కురవడంతో ధాన్యం తడిపోయింది. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం అమ్ముకునేందుకు కేంద్రాలకు తెచ్చిన తరుణంలో వర్షం వల్ల నష్టపోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వారు వేడుకుంటున్నారు. శివ్వంపేటలోని కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి 15రోజులు అవుతున్నా తూకం వేయలేదని రైతులు నిరసన వ్యక్తం చేశారు.

నేలకొరిన చెట్లు..

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని ఎల్లారెడ్డి– మెదక్ రోడ్డు పోచారం అభయాణ్యం వద్ద ఆదివారం వీచిన ఈదురు గాలులకు భారీ వృక్షాలు రోడ్డుపై నేలకొరిగాయి. అభయారణ్యం వద్ద ఉన్న గేటుపై చెట్టు కూలడంతో గేటు ధ్వంసమైంది. దాదాపు అరగంటపాటు వాహనాలు నిలిచిపోయాయి. అధికారులు జేసీబీ సహాయంతో చెట్లను పక్కకు తొలగించారు.

తప్పని తిప్పలు..

నర్సాపూర్: అకాల వర్షం కురువడంతో ధాన్యం కొనుగోలు కేంద్రానికి వడ్లు తెచ్చిన రైతులకు తిప్పలు తప్పలేదు. ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పినా వర్షపునీరు లోపలికి చేరడంతో ధాన్యం కొట్టుకుపోయింది. వర్షం తగ్గిన అనంతరం కొట్టుకుపోయిన వడ్లను రైతులు ఎత్తి తెచ్చుకున్నారు. రోజులు గడుస్తున్నా తూకంవేయక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని రుస్తుంపేటకు చెందిన రైతు అనిల్ మాట్లాడుతూ 25రోజుల క్రితం నర్సాపూర్‌లోని కొనుగోలు కేంద్రానికి సుమారు ఐదు వందల బస్తాల వడ్లు తెచ్చి ఎండపెట్టినా ఇంత వరకు తూకం వేయలేదని, వడ్లు మొలకలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు.



శివ్వంపేటలో నీటిని తొలగిస్తున్న రైతు



నర్సాపూర్: వర్షం నీటిని ఎత్తిపోస్తున్న మహిళ

రైతుల గోస పట్టని ప్రభుత్వం: మైసయ్య



మాట్లాడుతున్న మైసయ్య యాదవ్

మనోహరాబాద్(తూప్రాన్)/శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వం రైతుల గోసను పట్టించుకోవడం లేదని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మైసయ్య యాదవ్ ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో ధాన్యం తడిసి ముద్దవుతోందని, వెంటనే కొనగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మనోహరాబాద్ మండలంలోని దండుపల్లి, పోతారం, పర్కిబండ, శివ్వంపేట్ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలని, కలెక్టర్‌లు ప్రత్యేక దృష్టి సారించి రైతులకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు.

కోదండరామునికి పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేటలో కొలువైన పురాతన కోదండరామస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. వేద పండితుడు శాస్త్రుల వామనశర్మ, చంద్రాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

నల్లపోచమ్మకు సునీతారెడ్డి పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి నానుతండాలో నల్లపోచమ్మ ఉత్సవాలను గిరిజనులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రతియేటా రెండు రోజులపాటు ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా రెండో రోజు ఆదివారం నల్లపోచమ్మకు గిరిజనుల ఆచారాల ప్రకారం ప్రత్యేక పూజలు, బండ్లు, బోనాల ఊరేగింపు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి రైతులు పాడిపంటలతో సంతోషంగా ఉండాలని తల్లిని వేడుకున్నట్లు ఆమె చెప్పారు. ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జెడ్పీ కో–ఆప్షన్ మెంబర్ మన్సూర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, ఆంజనేయులుగౌడ్, సుదర్శన్‌గౌడ్, నవీన్‌గుప్తా, శ్రీనివాస్‌గౌడ్, రమేశ్‌గౌడ్, నరేశ్, తిరుపతి రాథోడ్, రామ్‌చందర్‌నాయక్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

తునికి ఆలయంలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ మోహన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శివప్ప, రాజేశ్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి బోనాలుతీసి ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంవద్ద డప్పు చప్పుడు శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.



శివ్వంపేట(నర్సాపూర్): ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

మొక్కలు సిద్ధం చేయాలి: ఎంపీపీ



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గవ్వలపల్లిలోని హరితహారం నర్సరీని ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీ నిర్వాహకులకు ఆదివారం ఆమె పలు సూచనలు చేశారు. జూన్‌లో నిర్వహించే హరితహారం కార్యక్రమం కోసం మొక్కలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వేసవిలో మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆమె వెంట మాజీ డీసీఎంఎస్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ చంద్రారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.